16-02-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇప్పుడు అశరీరులుగా అయి ఇంటికి వెళ్ళాలి, అందుకే ఎప్పుడైనా ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు ఆత్మా సోదరునిగా భావిస్తూ మాట్లాడండి, దేహీ-అభిమానులుగా ఉండేందుకు కృషి చేయండి"

ప్రశ్న:- భవిష్య రాజ్య తిలకాన్ని ప్రాప్తి చేసుకునేందుకు ఆధారము ఏమిటి?

జవాబు:- చదువు. ప్రతి ఒక్కరూ చదువుకుని రాజ్య తిలకాన్ని తీసుకోవాలి. తండ్రిది చదివించే డ్యూటీ, ఇందులో ఆశీర్వాదాల విషయమేమీ లేదు. పూర్తి నిశ్చయం ఉన్నట్లయితే శ్రీమతంపై నడుస్తూ ఉండండి. నిర్లక్ష్యం చేయకూడదు. ఒకవేళ అభిప్రాయ భేదాలలోకి వచ్చి చదువును విడిచి పెట్టినట్లయితే ఫెయిల్ అయిపోతారు, అందుకే బాబా అంటారు - మధురమైన పిల్లలూ, మీపై మీరు దయ చూపించుకోండి. ఆశీర్వాదాలను అడగకూడదు, చదువుపై అటెన్షన్ పెట్టాలి.

ఓం శాంతి. సుప్రీమ్ టీచర్ పిల్లలను చదివిస్తున్నారు. పరమపిత పరమాత్మ తండ్రి కూడా మరియు టీచర్ కూడా అని పిల్లలకు తెలుసు. మిమ్మల్ని ఏ విధముగా చదివిస్తారంటే, ఆ విధముగా ఇంకెవ్వరూ చదివించలేరు. శివబాబా మమ్మల్ని చదివిస్తారు అని మీరు అంటారు. ఇప్పుడు వీరు ఏ ఒక్కరికో మాత్రమే తండ్రి కారు. మన్మనాభవ, మధ్యాజీభవ, దీని అర్థాన్ని ఏమని వివరిస్తారంటే - మీరు నన్ను స్మృతి చేయండి. పిల్లలు ఇప్పుడు వివేకవంతులుగా అయ్యారు. అనంతమైన తండ్రి చెప్తున్నారు - మీ వారసత్వము ఉండనే ఉంది, దీనిని ఎప్పుడూ మర్చిపోకూడదు. తండ్రి ఆత్మలతోనే మాట్లాడుతారు. ఇప్పుడు మీరు జీవాత్మలు కదా. అనంతమైన తండ్రి కూడా నిరాకారుడే. ఈ తనువు ద్వారా వారు మనల్ని చదివిస్తున్నారని మీకు తెలుసు. ఇంకెవ్వరూ ఇలా భావించరు. స్కూల్లో టీచర్ చదివించినప్పుడు, లౌకిక టీచర్ లౌకిక పిల్లలను చదివిస్తున్నారు అని అనడం జరుగుతుంది. ఇక్కడ వీరు పారలౌకిక సుప్రీమ్ టీచర్, పారలౌకిక పిల్లలను చదివిస్తున్నారు. మీరు కూడా పరలోకమైన మూలవతనము యొక్క నివాసులే. తండ్రి కూడా పరలోకములో ఉంటారు. తండ్రి అంటారు - నేను కూడా శాంతిధామ నివాసినే మరియు మీరు కూడా అక్కడి నివాసులే. మనము ఇరువురమూ ఒకే ధామ నివాసులము. మీరు స్వయాన్ని ఆత్మగా భావించండి. నేను పరమ ఆత్మను. ఇప్పుడు మీరు ఇక్కడ పాత్రను అభినయిస్తున్నారు. పాత్రను అభినయిస్తూ, అభినయిస్తూ మీరు ఇప్పుడు పతితులుగా అయిపోయారు. ఇదంతా అనంతమైన స్టేజ్, ఇందులోనే ఆట జరుగుతుంది. ఈ సృష్టి అంతా కర్మక్షేత్రము, ఇందులో ఆట జరుగుతూ ఉంది. ఇది అనంతమైన ఆట అని, ఇందులో పగలు మరియు రాత్రి కూడా ఉంటాయని కూడా కేవలం మీకే తెలుసు. సూర్యుడు మరియు చంద్రుడు ఎంతటి అనంతమైన ప్రకాశాన్ని ఇస్తారు, ఇది అనంతమైన విషయము. ఇప్పుడు మీకు జ్ఞానం కూడా ఉంది. రచయితయే వచ్చి రచయిత మరియు రచనల ఆదిమధ్యాంతాల పరిచయాన్ని ఇస్తారు. తండ్రి అంటారు, మీకు రచన యొక్క ఆదిమధ్యాంతాల రహస్యాన్ని వినిపించడానికి వచ్చాను. ఇది పాఠశాల, చదివించేవారు అభోక్త. నేను అభోక్తను అని ఈ విధంగా ఇంకెవ్వరూ అనరు. అహ్మదాబాద్ లో ఒక సాధువు ఇలా అనేవారు, కానీ తర్వాత అతని మోసం పట్టుబడింది. ఈ సమయంలో మోసాలు కూడా ఎన్నో వెలువడుతున్నాయి. వేషధారులు ఎంతోమంది ఉన్నారు. వీరికైతే ఏ వేషము లేదు. మనుష్యులు శ్రీకృష్ణుడు గీతను వినిపించారు అని భావిస్తారు, మరి ఈ రోజు ఎంతమంది శ్రీకృష్ణులు తయారయ్యారు? వాస్తవానికి ఇంతమంది శ్రీకృష్ణులు ఉండరు. ఇక్కడైతే మిమ్మల్ని శివబాబా వచ్చి చదివిస్తారు, ఆత్మలకు వినిపిస్తారు.

మీకు పదే-పదే చెప్పడం జరిగింది - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ సోదరులకు వినిపించండి. బాబా జ్ఞానాన్ని మేము సోదరులకు వినిపిస్తున్నాము అని బుద్ధిలో ఉండాలి. పురుషులైనా లేక స్త్రీలైనా, ఇరువురూ సోదరులే, అందుకే తండ్రి అంటారు - మీరందరూ నా వారసత్వానికి హక్కుదారులు. మామూలుగానైతే స్త్రీలకు వారసత్వము లభించదు ఎందుకంటే వారు అత్తవారింటికి వెళ్ళాలి. ఇక్కడైతే అందరూ ఆత్మలే. అశరీరులుగా అయి ఇంటికి వెళ్ళాలి. ఇప్పుడు మీకు ఏ జ్ఞాన రత్నాలైతే లభిస్తున్నాయో, అవి అవినాశీ రత్నాలుగా అయిపోతాయి. ఆత్మయే జ్ఞానసాగరముగా అవుతుంది కదా. ఆత్మయే అన్నీ చేస్తుంది. కానీ మనుష్యులకు దేహాభిమానం ఉన్న కారణముగా దేహీ-అభిమానులుగా అవ్వరు. ఇప్పుడు మీరు దేహీ-అభిమానులుగా అయి ఒక్క తండ్రిని స్మృతి చేయాలి. ఎంతో కొంత శ్రమించాలి కదా. లౌకిక గురువును ఎంతగా తలచుకుంటారు. విగ్రహాన్ని పెట్టుకుంటారు. శివుని చిత్రము ఎక్కడ, ఈ మనుష్యుల చిత్రము ఎక్కడ. రాత్రికి, పగలుకు ఉన్నంత తేడా ఉంది. వారు గురువు ఫోటోను వేసుకుంటారు. పతులకు అలా ఇతరుల ఫోటోను వేసుకోవడం నచ్చదు. అయితే, శివుని చిత్రాన్ని ధరించినట్లయితే అది అందరికీ

నచ్చుతుంది ఎందుకంటే వారైతే పరమపిత కదా. వారి చిత్రమైతే ఉండాలి. వీరు కంఠహారముగా తయారుచేసేవారు. మీరు రుద్రమాలలోని మణులుగా అవుతారు. వాస్తవానికి ప్రపంచమంతా రుద్రమాల కూడా, అలాగే ప్రజాపిత బ్రహ్మా యొక్క మాల కూడా. పైన వంశవృక్షము ఉంది. అది హద్దులోని వంశవృక్షము, ఇది అనంతమైనది. మనుష్యమాత్రులు ఎవరైతే ఉన్నారో, ఇది వారందరి మాల. ఆత్మ ఎంత చిన్నని బిందువు. చాలా చిన్నని బిందువు. ఇలా బిందువులను పెడుతూ పోతే లెక్కలేనంత అవుతాయి. లెక్కపెడుతూ, లెక్కపెడుతూ అలసిపోతారు. కానీ చూడండి, ఆత్మల వృక్షము ఎంత చిన్నగా ఉంది. బ్రహ్మతత్వములో చాలా కొద్ది స్థానములో ఉంటుంది. వారు మళ్ళీ పాత్రను అభినయించడానికి ఇక్కడకు వస్తారు. ఇక్కడ ఎంత పెద్ద ప్రపంచము ఉంది. ఏరోప్లేన్లలో ఎక్కడెక్కడికో వెళ్తారు. అక్కడ మళ్ళీ ఈ విమానాలు మొదలైనవాటి అవసరం ఉండదు. అక్కడ ఆత్మల చిన్నని వృక్షముంది. ఇక్కడ మనుష్యుల వృక్షము ఎంత పెద్దగా ఉంది.

వీరంతా ప్రజాపిత బ్రహ్మాకు సంతానము. వీరినే కొందరు ఆడమ్ అని, కొందరు ఆదిదేవ్ అని అంటారు. స్త్రీ, పురుషులైతే తప్పకుండా ఉన్నారు. మీది ప్రవృత్తి మార్గము. నివృత్తి మార్గములో ఆట ఉండదు. ఒక చేతితో ఏమి జరుగుతుంది? రెండు చక్రాలూ కావాలి. ఇరువురూ ఉంటే పరస్పరం రేస్ చేసుకుంటారు. రెండో చక్రం తోడు ఇవ్వకపోతే ఢీలా అయిపోతారు. కానీ అలా ఒకరి కారణముగా నిలిచిపోకూడదు. మొట్టమొదట పవిత్ర ప్రవృత్తి మార్గము ఉండేది. ఆ తర్వాత అపవిత్ర ప్రవృత్తి మార్గము ఉంటుంది. కిందకు పడుతూనే ఉంటారు. ఈ వృక్షము ఎలా పెరుగుతుంది, ఏ విధముగా ఎడిషన్ అవుతూ ఉంటుంది అనేది మీ బుద్ధిలో మొత్తం జ్ఞానమంతా ఉంది. ఇటువంటి వృక్షాన్ని ఎవ్వరూ తయారుచేయలేరు. ఎవరి బుద్ధిలోనూ రచయిత మరియు రచనల ఆదిమధ్యాంతాల జ్ఞానం లేనే లేదు, అందుకే బాబా అన్నారు - ఇలా వ్రాయండి, మేము రచయిత ద్వారా రచయిత మరియు రచనల జ్ఞానము యొక్క అంతమును పొందాము. వారికి రచయితను గురించి తెలియదు, అలాగే రచనను గురించి తెలియదు. ఒకవేళ ఈ జ్ఞానం పరంపరగా నడుస్తూ వచ్చినట్లయితే మరి దీనిని ఎవరైనా తెలియజేయాలి కదా. దీని గురించి కేవలం బ్రహ్మాకుమార-కుమారీలైన మీరు తప్ప ఇంకెవ్వరూ తెలియజేయలేరు. బ్రాహ్మణులైన మనల్నే పరమపిత పరమాత్మ చదివిస్తారని మీకు తెలుసు. బ్రాహ్మణులైన మనది ఉన్నతోన్నతమైన ధర్మము. చిత్రాన్ని కూడా తప్పకుండా చూపించవలసి ఉంటుంది. చిత్రాలు లేకుండా ఎప్పుడూ బుద్ధిలో కూర్చోదు. చిత్రాలు చాలా పెద్దపెద్దగా ఉండాలి. వెరైటీ ధర్మాల వృక్షము ఎలా పెరుగుతుంది అనేది కూడా అర్థం చేయించారు. ఇంతకుముందు, ఆత్మయైన మనమే పరమాత్మ, పరమాత్మయే ఆత్మ అని అనేవారు. ఇప్పుడు తండ్రి దీని అర్థాన్ని కూడా తెలియజేసారు. ఈ సమయంలో మనమే బ్రాహ్మణులుగా ఉన్నాము. మళ్ళీ మనమే దేవతలుగా కొత్త ప్రపంచములో అవుతాము. ఇప్పుడు మనం పురుషోత్తమ సంగమయుగములో ఉన్నాము అనగా ఇది పురుషోత్తములుగా తయారయ్యే సంగమయుగము. రచయిత మరియు రచన యొక్క అర్థాన్ని, హంసో యొక్క అర్థాన్ని, దీనినంతటినీ మీరు అర్థం చేయించవచ్చు. ఓం అనగా మొదట నేను ఆత్మను, ఆ తర్వాత ఈ శరీరము. ఆత్మ అవినాశీ మరియు ఈ శరీరము వినాశీ. మనం ఈ శరీరాన్ని ధారణ చేసి పాత్రను అభినయిస్తాము. దీనినే ఆత్మాభిమానులుగా ఉండడము అని అంటారు. ఆత్మయైన మనము ఫలానా పాత్రను అభినయిస్తాము, ఆత్మయైన మనము ఇది చేస్తాము, ఆత్మయైన మనము పరమాత్ముని పిల్లలము. ఇది ఎంత అద్భుతమైన జ్ఞానము. ఈ జ్ఞానము కేవలం తండ్రిలోనే ఉంది, అందుకే తండ్రినే పిలుస్తారు.

తండ్రి జ్ఞానసాగరుడు. వారితో పోలిస్తే అజ్ఞాన సాగరము కూడా ఉంది. అర్ధకల్పం జ్ఞానము, అర్ధకల్పం అజ్ఞానము. జ్ఞానము గురించి ఎవ్వరికీ తెలియనే తెలియదు. జ్ఞానము అనగా రచయిత ద్వారా రచనను తెలుసుకోవడము. కావున తప్పకుండా రచయితలోనే జ్ఞానము ఉంది కదా, అందుకే వారిని రచయిత అని అనడం జరుగుతుంది. రచయితయే ఈ రచనను రచించారు అని మనుష్యులు భావిస్తారు. తండ్రి అర్థం చేయిస్తారు, ఇది అనాదిగా తయారై-తయారుచేయబడిన ఆట. పతిత పావనా రండి అని అంటారు, మరి వారిని రచయిత అని ఎలా అంటారు? ప్రళయం జరిగి మళ్ళీ రచిస్తే, అప్పుడు రచయిత అని అంటారు. తండ్రి అయితే పతిత ప్రపంచాన్ని పావనంగా తయారుచేస్తారు. కావున ఈ మొత్తం విశ్వము యొక్క వృక్షమేదైతే ఉందో, దాని ఆదిమధ్యాంతాలను గురించి మధురాతి మధురమైన పిల్లలకే తెలుసు. ఏ విధముగా తోటమాలికి ప్రతి బీజము మరియు వృక్షము గురించి తెలిసి ఉంటుంది కదా. బీజాన్ని చూడగానే మొత్తం వృక్షమంతా బుద్ధిలోకి వచ్చేస్తుంది. అలాగే వీరు మానవాళికి (మనుష్య సృష్టికి) బీజము. వీరి గురించి ఎవ్వరికీ తెలియదు. పరమపిత పరమాత్మ సృష్టికి బీజరూపుడు, సత్ చిత్ ఆనంద స్వరూపుడు, సుఖము, శాంతి, పవిత్రతల సాగరుడు అని గానం చేస్తారు కూడా. ఈ జ్ఞానమంతా పరమపిత పరమాత్మ ఈ శరీరము ద్వారా ఇస్తున్నారని మీకు తెలుసు. మరి తప్పకుండా ఇక్కడకు వస్తారు కదా. పతితులను పావనులుగా ప్రేరణ ద్వారా ఎలా తయారుచేస్తారు.

కావున తండ్రి ఇక్కడకు వచ్చి అందరినీ పావనంగా తయారుచేసి తీసుకువెళ్తారు. ఆ తండ్రే మీకు ఈ పాఠాన్ని చదివిస్తున్నారు. ఇది పురుషోత్తమ సంగమయుగము. పురుషులు తమోప్రధానుల నుండి శ్రేష్ఠ సతోప్రధానులుగా ఏ విధముగా అవుతారు అన్నదానిపై మీరు భాషణ కూడా చేయవచ్చు. మీ వద్ద టాపిక్ లైతే ఎన్నో ఉన్నాయి. ఇది పతిత తమోప్రధాన ప్రపంచము, ఇది సతోప్రధానముగా ఎలా తయారవుతుంది - అన్నది కూడా అర్థం చేసుకోదగిన విషయము. ముమ్ముందు మీ ఈ జ్ఞానాన్ని వింటారు. ఒకవేళ దీనిని వదిలి వెళ్ళిపోయినా కానీ మళ్ళీ వస్తారు ఎందుకంటే గతి, సద్గతులు లభించే దుకాణము ఇదొక్కటే. సర్వుల సద్గతిదాత ఒక్క తండ్రేనని మీరు చెప్పవచ్చు. వారిని శ్రీ శ్రీ అని అంటారు. శ్రేష్ఠాతి-శ్రేష్ఠమైనవారు పరమపిత పరమాత్మ. వారు మనల్ని శ్రేష్ఠముగా తయారుచేస్తారు. సత్యయుగము శ్రేష్ఠమైనది, కలియుగము భ్రష్టమైనది. భ్రష్టాచారము ఉంది అని అంటారు కూడా. కానీ స్వయాన్ని ఆ విధంగా భావించరు. పతిత ప్రపంచములో శ్రేష్ఠులు ఒక్కరు కూడా లేరు. ఆ శ్రీ శ్రీ ఎప్పుడైతే వస్తారో, అప్పుడు వారు వచ్చి శ్రీ (శ్రేష్ఠము) గా తయారుచేస్తారు. శ్రీ టైటిల్ సత్యయుగ ఆదిలో దేవతలకు ఉండేది. ఇక్కడైతే అందరినీ శ్రీ శ్రీ అనేస్తారు. వాస్తవానికి శ్రీ అన్న పదము పవిత్రతకు సంబంధించినది. ఇతర ధర్మాలవారు ఎవ్వరూ తమను తాము శ్రీ అని అనుకోరు. శ్రీ పోప్ అని అంటారా? ఇక్కడైతే అందరినీ అలా అంటూ ఉంటారు. ముత్యాలను గ్రోలే హంసలు ఎక్కడ, అశుద్ధమైనవాటిని తినే కొంగలు ఎక్కడ. తేడా అయితే ఉంది కదా. ఈ దేవతలు పుష్పాలు, అది అల్లా యొక్క పుష్పాల తోట. తండ్రి మిమ్మల్ని పుష్పాలుగా తయారుచేస్తున్నారు. ఇకపోతే పుష్పాలలో వెరైటీ ఉంది. అన్నింటికన్నా మంచి పుష్పము కింగ్ ఫ్లవర్. ఈ లక్ష్మీ-నారాయణులను కొత్త ప్రపంచము యొక్క రాజు మరియు రాణి పుష్పాలు అని అంటారు.

పిల్లలైన మీకు ఆంతరిక సంతోషము ఉండాలి. ఇందులో బాహ్యంగా చేసేదేమీ ఉండదు. ఈ లైట్లు మొదలైనవి వెలిగించడం వెనుక కూడా అర్థముండాలి. శివ జయంతినాడు వెలిగించాలా లేక దీపావళినాడా? దీపావళినాడు లక్ష్మిని ఆహ్వానిస్తారు. ఆమె నుండి ధనం అడుగుతారు. భండారాను నింపేవారైతే శివ భోళా భండారీ. శివబాబా ద్వారా మనకు తరగని ఖజానాలు నిండుతాయని మీకు తెలుసు. ఈ జ్ఞాన రత్నాలే ధనము. అక్కడ కూడా మీ వద్ద అపారమైన ధనము ఉంటుంది. కొత్త ప్రపంచములో మీరు సుసంపన్నులుగా అయిపోతారు. సత్యయుగములో లెక్కలేనన్ని వజ్ర-వైఢూర్యాలు ఉండేవి. మళ్ళీ అవే ఉంటాయి. మనుష్యులు తికమకపడతారు. ఇవన్నీ అంతమైపోతాయి కదా, మళ్ళీ ఎక్కడి నుండి వస్తాయి? అని తికమకపడతారు. గనులు ఖాళీ అయిపోయాయి, పర్వతాలు బద్దలైపోయాయి, కావున అవి మళ్ళీ ఎలా వస్తాయి? మీరు చెప్పండి - చరిత్ర పునరావృతమవుతుంది కదా, ఏవేవైతే ఉండేవో, అవి మళ్ళీ పునరావృతమవుతాయి. పిల్లలైన మీరు స్వర్గానికి యజమానులుగా అవ్వడానికి పురుషార్థం చేస్తున్నారు. స్వర్గము యొక్క చరిత్ర-భౌగోళికము మళ్ళీ పునరావృతమవుతాయి. పాటలో ఉంది కదా - మీరు మాకు మొత్తం సృష్టిని, మొత్తం సముద్రాన్ని, మొత్తం పృథ్వినీ ఇచ్చేసారు, వీటిని మా నుండి ఎవ్వరూ లాక్కోలేరు. వాటితో పోలిస్తే ఇప్పుడేమి ఉంది! భూమి కొరకు, నీటి కొరకు, భాష కొరకు కొట్లాడుకుంటూ ఉంటారు.

స్వర్గ రచయిత అయిన బాబా యొక్క జన్మదినం జరుపుకోవడం జరుగుతుంది. తప్పకుండా వారు స్వర్గ రాజ్యాధికారాన్ని ఇచ్చి ఉంటారు. ఇప్పుడు మిమ్మల్ని తండ్రి చదివిస్తున్నారు. మీరు ఈ శరీరము యొక్క నామ-రూపాల నుండి అతీతముగా అయి స్వయాన్ని ఆత్మగా భావించాలి. అయితే యోగబలము ద్వారా లేక శిక్షలు అనుభవించి పవిత్రముగా అవ్వాలి. అప్పుడు పదవి కూడా తగ్గిపోతుంది. మేము ఇంతటి పదవిని పొందుతాము, టీచర్ ఇంతగా చదివించారు అని విద్యార్థుల బుద్ధిలో ఉంటుంది కదా. తర్వాత టీచర్ కు కూడా కానుకలు ఇస్తారు. ఇక్కడైతే తండ్రి మిమ్మల్ని విశ్వాధిపతులుగా తయారుచేస్తారు. కావున మీరు మళ్ళీ భక్తి మార్గములో వారిని తలచుకుంటూ ఉంటారు. ఇకపోతే తండ్రికి మీరేమి కానుకను ఇస్తారు? ఇక్కడ ఏదైతే చూస్తున్నారో అదేదీ ఉండేది లేదు. ఇది పాత ఛీ-ఛీ ప్రపంచము, అందుకే నన్ను పిలుస్తారు. తండ్రి మిమ్మల్ని పతితుల నుండి పావనులుగా తయారుచేస్తారు. ఈ ఆటను స్మృతి చేయాలి. నాలో రచన యొక్క ఆదిమధ్యాంత జ్ఞానం ఉంది, దీనిని మీకు వినిపిస్తాను, మీరు ఇప్పుడు వింటారు, మళ్ళీ మర్చిపోతారు. 5,000 సంవత్సరాల తర్వాత మళ్ళీ చక్రం పూర్తవుతుంది. మీ పాత్ర ఎంత ప్రియమైనది. మీరు సతోప్రధానమైనవారిగా మరియు ప్రియమైనవారిగా అవుతారు. మళ్ళీ తమోప్రధానముగా కూడా మీరే అవుతారు. బాబా, రండి అని మీరే పిలుస్తారు. ఇప్పుడు నేను వచ్చాను. ఇప్పుడు ఒకవేళ నిశ్చయము ఉన్నట్లయితే శ్రీమతముపై నడవాలి. నిర్లక్ష్యము చేయకూడదు. చాలామంది పిల్లలు అభిప్రాయ భేదాలలోకి వచ్చి చదువును వదిలేస్తారు. శ్రీమతముపై నడవకపోతే, చదవకపోతే ఫెయిల్ కూడా మీరే అవుతారు. తండ్రి అంటారు, మీపై మీరు దయ చూపించుకోండి. ప్రతి ఒక్కరూ చదువుకొని స్వయానికి రాజ్యతిలకాన్ని ఇచ్చుకోవాలి. తండ్రిది చదివించే డ్యూటీ,

ఇందులో ఆశీర్వాదాల విషయమేమీ లేదు. అలాగైతే అందరినీ ఆశీర్వదించవలసి ఉంటుంది. ఈ కృప మొదలైనవన్నీ భక్తి మార్గములో కోరుకుంటారు. ఇక్కడ ఆ విషయమేమీ లేదు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ప్రవృత్తిలో ఉంటూ పరస్పరం రేస్ చేయాలి. కానీ ఒకవేళ ఏ కారణం చేతనైనా ఒక చక్రం ఢీలా అయితే, వారి వెనుక ఆగిపోకూడదు. స్వయాన్ని రాజ్యతిలకము అందుకునేందుకు యోగ్యులుగా తయారుచేసుకోవాలి.

2. శివజయంతిని చాలా వైభవోపేతముగా జరుపుకోవాలి ఎందుకంటే శివబాబా ఏ జ్ఞాన రత్నాలనైతే ఇస్తారో, వాటి ద్వారానే మీరు కొత్త ప్రపంచములో సుసంపన్నులుగా అవుతారు. మీ భండారాలన్నీ నిండుగా అయిపోతాయి.

వరదానము:- తండ్రి నుండి శక్తిని తీసుకుని ప్రతి పరిస్థితిని పరిష్కరించే సాక్షీదృష్టా భవ

అతి తర్వాతనే అంతము జరుగుతుందని పిల్లలైన మీకు తెలుసు. కావున అన్ని రకాల అలజడులు అతిలో జరుగుతాయి, పరివారములో కూడా గొడవలు జరుగుతాయి, మనస్సులో కూడా అనేక అలజడులు వస్తాయి, ధనము కూడా కిందా-మీదా అవుతుంది. కానీ ఎవరైతే తండ్రికి సహచరులుగా ఉన్నారో, సత్యముగా ఉన్నారో, వారి బాధ్యత తండ్రిది. అటువంటి సమయంలో మనస్సు తండ్రి వైపు ఉన్నట్లయితే నిర్ణయ శక్తితో అన్నింటినీ దాటి వేస్తారు. సాక్షీదృష్టాగా అయినట్లయితే తండ్రి శక్తితో ప్రతి పరిస్థితిని సహజంగా పరిష్కరిస్తారు.

స్లోగన్:- ఇప్పుడు అన్ని తీరాలనూ వదిలి ఇంటికి వెళ్ళేందుకు ఏర్పాట్లు చేసుకోండి.